https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 PM TO 10 PM

సంపుటి: 01 / సంచిక:23 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / మంగళవారం, సెప్టెంబర్ 08,2026



## శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం

### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08:**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

## ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు, వాణిజ్యాన్ని పెంచాలని నిర్ణయించాం

### ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు, వాణిజ్యాన్ని పెంచాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**ఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08:**

ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు, వాణిజ్యాన్ని పెంచాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి. టు లారెల్ జూనియర్‌తో మంత్రి ఉత్తమ్ ఈరోజు (మంగళవారం) సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను పెంచడంతోపాటు తెలంగాణ -- ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరించే అవకాశాలపై ఇరువురు మాట్లాడారు.భారతదేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా ఉందని మంత్రి ఉత్తమ్ వివరించారు. భారీ పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ, అవసరమైన అనుభవం తెలంగాణకు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై కార్యదర్శి లారెల్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ నుంచి మరింత పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన తెలిపారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు, ఎగుమతిదారులు, రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే విధానంపై చర్చించామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఫిలిప్పీన్స్‌కు దిగుమతి చేసుకునే బియ్యం అవసరం గణనీయంగా ఉండటం, అంతర్జాతీయంగా బియ్యం సరఫరా చేసే దేశాల సంఖ్యను విస్తరించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తుండటం నేపథ్యంలో ఈ చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడిందని చెప్పుకొచ్చారు. పోటీ ధరలు, విశ్వసనీయమైన నాణ్యత, నిర్ణీత సమయంలో సరఫరా చేయగల సామర్థ్యంతో తెలంగాణ దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదని ఉత్తమ్ పేర్కొన్నారు.బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానాలు, రవాణా, ధ్రువీకరణ ప్రక్రియలు, శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలపై కూడా చర్చించామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఈ అంశాలను సంబంధిత అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పరిశీలించి, వాణిజ్య అవకాశాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించామని అన్నారు. తెలంగాణ నుంచి మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంపైనా కార్యదర్శి లారెల్ ఆసక్తి వ్యక్తం చేశారని చెప్పారు. దీనిని స్వాగతించినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.



విత్తనోత్పత్తి, ఆహార శుద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో తెలంగాణకు బలమైన సామర్థ్యం ఉందని అన్నారు.ఎగుమతికి అనువైన ఉత్పత్తులు, నాణ్యతా ప్రమాణాలు, అనుమతులు, ఇతర నియంత్రణ నిబంధనలను సంబంధిత ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగ ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు అవకాశాలు కల్పించడంతో రైతులు, రైస్ మిల్లర్లు, విత్తన కంపెనీలు, ఆహార శుద్ధి పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని ఇతర వర్గాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి చెప్పారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ పరిశ్రమలకు స్థిరమైన, లాభదాయకమైన అంతర్జాతీయ మార్కెట్లను సృష్టించడమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను దీర్ఘకాలంపాటు విశ్వసనీయంగా సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక నైపుణ్యం తెలంగాణకు ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## స్టాలిన్‌ను బాడీ షేమింగ్ చేయలె.. మాటల మధ్యలో అలా చేశానంతే..!

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ జోసెఫ్ అసెంబ్లీలో తన సంజ్ఞలపై రేగిన దుమారంపై వివరణ ఇచ్చారు. తాను ఉద్దేశపూర్వంగా ఎవరినీ అవమానపరిచేలా ప్రవర్తించలేదని విజయ్ తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు గగ్గోలు పెడుతున్నట్టుగా.. తాను డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ను బాడీ షేమింగ్ చేయలేదని విజయ్ స్పష్ట చేశారు. సభలో





మాట్లాడుతున్న క్రమంలో తాను దవడ పట్టుకున్నానని.. అంతేతప్ప తనకు ఏ దురుద్దేశం లేదని విజయ్ వెల్లడించారు.అసెంబ్లీలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను అవమానించారనే కథనాల నేపథ్యంలో ముఖ్యమంత్రి విజయ్ జోసెఫ్ స్పందించారు. తాను ఉద్దేశపూర్వకంగా, వ్యక్తిగతంగా ఒకరిని బాధ పెట్టేలా ప్రవర్తించలేదని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌ను హేళన చేశారని తనపై వస్తున్న ప్రచారంపై విజయ్ ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 7వ తేదీన శాసన సభలో మాట్లాడుతున్న సమయంలో తాను అనుకోకుండా అలా దవడ విరిగిన సంజ్ఞ చేశానని ఆయన తెలిపారు.

## చావు రాజకీయాలు చేయిస్తారా?

- కేసీఆర్‌ను అంతమొందించేందుకు కుట్ర
- కేసీఆర్ నివాసం ముట్టడి రేవంత్ ఆలోచనే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు. "వెయ్యి డప్పులతో కేసీఆర్ ఇల్లు ముట్టడిస్తామన్నది శంకర్ వ్యక్తిగత మాట కాదు. అది వెనుకుండి నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనే" అని ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల వేళ సభ్యులను సభకు రానివ్వకుండా కేసీఆర్ ఫాంహౌస్ కు కాంగ్రెస్ శ్రేణులను పంపి దాడులు చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ చావు గురించి మాట్లాడినందుకు గాను రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను నేరుగా రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ ఈ రకమైన దిగజారుడు వ్యాఖ్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తూ, మాజీ ముఖ్యమంత్రి ప్రాణాలకు హాని తలపెట్టేలా తీవ్ర వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వేముల వీరేశంలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026

### పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08:**

తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు యువతలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ 2026'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్ రెడ్డిలతో కలిసి సచివాలయంలో ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ ఒక అద్భుత వేదికగా ఉపయోగపడుతుందన్నారు. బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రతిబింబించేలా షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు.

## సభలో బీఆర్ఎస్‌కు ఒక న్యాయం, బీజేపీకి ఒక న్యాయమా..? : అక్బరుద్దీన్ ఒవైసీ



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08**

శాసనసభలో బీఆర్ఎస్ పార్టీకి ఒక న్యాయం, బీజేపీకి ఒక న్యాయమా..? అని ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లని టీషర్టులు, వాటిపై ఏదో రాసి ఉందనే కారణంతో వారిని సభలోకి అనుమతించలేదని, మరి బీజేపీ సభ్యులు ప్లకార్డులను ప్రదర్శించడాన్ని ఎందుకు అనుమతించారని ఆయన నిలదీశారు. టీషర్టుల ధరిస్తే సభలోకి అనుమతి లేనప్పుడు, సభలో ఫొటలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించేందుకు కూడా ఇవ్వకూడదు కదా అని క్వశ్చన్ చేశారు మీరు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీని ఒకలా, బీజేపీని ఒకలా ట్రీట్ చేస్తున్నారని, ఇది కరెక్టు కాదని అక్బరుద్దీన్ చెప్పారు. బీజేపీకి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఎందుకని ప్రశ్నించారు.

## కెసిఆర్ ఫాం హౌస్ దగ్గరకు వెళ్లడం కాంగ్రెస్ పార్టీది పిరికిపంద చర్య

ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు08:



బిఆర్ఎస్ పార్టీ మోటకొండూర్ సోషల్ మీడియా కన్వీనర్ గంధమల్ల మధు మాట్లాడుతూ ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ నాయకులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ నాయకుడైన కేసీఆర్ చావును కోరుకోవడం విడ్డూరంగా ఉంది. ఇదే కాంగ్రెస్ పార్టీకి దళితుల మీద ప్రేమ ఉంటే అంబేద్కర్ అభయస్తం కింద 25 లక్షలు ఇస్తామన్నారు. ఎంతమంది దళితులకు అమలు చేశారు.ఎంతమంది దళితులకు దళిత బంధు ఇచ్చినారు.దళిత డిక్లరేషన్లు ఏమైనాయి ఇంతవరకు.అలాగే ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారు.ఏ ప్రభుత్వం దళితులకు సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు వెయ్యలేదు.ఈ ప్రభుత్వం దళితుల మీద మొసలు కన్నీరు కారుస్తున్నారు. కాంగ్రెస్ గుండాలరా కెసిఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే యావత్ తెలంగాణ మొత్తం రణరంగమే.కాంగ్రెస్ నాయకులు కెసిఆర్ ఫామ్ హౌస్ దగ్గర ధర్నా గాని కెసిఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే బిఆర్ఎస్ పార్టీ దళిత నాయకులందరూ కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు చావు డప్పు మోగిస్తాం.అలాగే మంత్రుల, ఎమ్మెల్యేల ఇంటి ముందు చావు డప్పు మోగిస్తామని అన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలో పాల్గొన్న పల్లెర్ల సిపిఐ నేతలు

ట్రైనెట్ న్యూస్, యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు08:

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ మూడోవ రాష్ట్ర మహాసభలో పాల్గొన్న పల్లెర్ల సిపిఐ నేతలు ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి దుర్గపతి నర్సయ్య మాట్లాడుతూ యువత సమస్యలపై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన చేయనున్న సందర్భంగా యువత ఐక్యతే మన బలం యువత హక్కుల సాధనే మన లక్ష్యం యువత రాజకీయంలో పాల్గొనలనీ జిందాబాద్ యువజన ఉద్యమం వర్ధిల్లాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు కిష్టయ్య లింగయ్య గోపాల్ రాములు వెంకటేష్ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



## బి స్మార్ట్ పోచంపల్లి అధ్యక్షులుగా లింగా స్వామి

### నియామక పత్రం అందించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జలందర్ రెడ్డి


ట్రైనెట్ న్యూస్,యాదాద్రి భువనగిరి,సెప్టెంబరు 08:

బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడాల జలంధర్ రెడ్డి అధ్యక్షతన పోచంపల్లి మండల కమిటీ అధ్యక్షులుగా చెరుకు లింగస్వామి సెక్రటరీగా బుగ్గ లింగస్వామి కోశాధికారిగా ఎన్ సజీవ్ కుమార్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్స్ పాఠశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని వారికి అండగా ఉండి అన్ని రకాలు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతు నాపై నమ్మకంతో మండల అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు జిల్లా కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మండలంలోని పాఠశాలల సమర్థవంతంగా నిర్వహించేందుకు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానికి నా వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి చిట్టిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నోముల బసవ రెడ్డి, జిల్లా కోశాధికారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు కృష్ణంరాజు, మల్లేశం,రావుల జంగయ్య, జానీ,వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలోచింపజేసిన ఏడోగది నాటకం

రవీంద్ర భారతి, హైదరాబాద్ ట్రైనెట్ న్యూస్ 8 :



పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వర్గీయ రఘుబాబు 37వ వర్ధంతి సందర్భంగా స్మృతాంజలి సభ మంగళ వారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీజయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీజ సాదినేని దర్శకత్వంలో ఏడో గది అనే నాటకాన్ని ప్రదర్శించారు. అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాలని పలువురు వక్తలు సూచించారు. సమాజంలోని పలు అంశాలపై కళాకారుల ప్రదర్శనలు ఆహుతులను ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, దర్శకుడు వివిఎన్ ఆదిత్య, నిర్వాహకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మాస్ కమ్యూనికేషన్ లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన ప్రాన్నుత..





ఉస్మానియా యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 8 :

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగంలో దాసి ప్రాన్నుత రెండు స్వర్ణ పతకాలు సాధించారు. మంగళవారం నిర్వహించిన ఓయూ 85వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్, ఓయూ చాన్స్ లర్ చేతుల మీదుగా ఆమె స్వర్ణ పతకాలు, అవార్డులను అందుకున్నారు. ఈ ఘనతతో ఆమె కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. పెద్దపల్లి జిల్లా కూనారం గ్రామానికి చెందిన ప్రాన్నుత ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్‌లో జన్మించారు. బెంగళూరు, వరంగల్ లోని కేంద్రీయ విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసిన ఆమె పదో తరగతి, ఇంటర్మీడియట్ లో టాపర్‌గా నిలిచారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరాత్వాడా విశ్వవిద్యాలయం (బిఏఎంయూ) లో గ్రాడ్యుయేషన్ లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ పూర్తి చేశారు. ప్రాన్నుత మాజీ భారత వైమానిక దళ అధికారి దాసి ప్రభాకర్, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కల్పన దంపతుల కుమార్తె. దాసి ప్రభాకర్ భారత వైమానిక దళంలో సేవలందించడంతో పాటు కార్గిల్ యుద్ధంలోనూ పాల్గొన్నారు. దేశానికి అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన పతకం అందుకున్నారు. తమ కుమార్తె రెండు స్వర్ణ పతకాలు సాధించడం కుటుంబానికి ఎంతో గర్వకారణమని తల్లిదండ్రులు తెలిపారు. ప్రాన్నుత సాధించిన విజయం క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు.

### ప్రతికంఠం కిష్టమరాజు శతజయంతి:1926-2026

## అవినీతికి తావులేని పోలీస్, ఆత్మీయతకు నిలువెత్తు రూపం



ట్రైనెట్ న్యూస్,యాదాద్రి భువనగిరి,సెప్టెంబరు08:

తెలుగు నేలపై నిజాయితీకి, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన పోలీస్ అధికారి ప్రతికంఠం కిష్టమరాజు. వారి శత జయంతి (1926-2026) ఈ సంవత్సరం జరుపుకోవడం మనందరికీ గర్వకారణం.జననం, బాల్యం, విద్యాభ్యాసం: పూర్వపు వరంగల్ జిల్లా, కోడూరు గ్రామం వీరి జన్మస్థలం. తల్లి రాధమ్మ, తండ్రి సోమరాజులకు జన్మించారు. ఐదుగురు అన్నదమ్ములు, ముగ్గురు చెల్లెళ్లతో కూడిన పెద్ద కుటుంబంలో ఒక అన్న, ముగ్గురు తమ్ముళు వీరికి ఉన్నారు. ఆ రోజుల్లోనే విద్యను అభ్యసించడానికి జనగాం వెళ్లి, ఆ ప్రాంతంలోనే ప్రాథమిక విద్య పూర్తిచేసారు. హన్మకొండలో పదవ తరగతి ఇంటర్మీడియట్ పూర్తిచేసారు. మొదటి పట్టభద్రునిగా ఉస్మానియాలో డిగ్రి పూర్తి చేసి చరిత్ర సృష్టించారు. చదువు పట్ల వారికున్న తపన, ఆ రోజుల్లో డిగ్రీ పూర్తి చేయడం అనేది వారి పట్టుదలకు నిదర్శనం. తర్వాత న్యాయ శాస్త్రంలో పట్టా పొందారు.

**పోలీస్ శాఖలో చెరగని ముద్ర:**

ఉద్యోగ జీవితంలో 1960 లో సబ్ ఇన్స్పెక్టర్ గా ప్రారంభించి పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో వివిధ హోదాల్లో పనిచేసి, చివరకు అడిషనల్ ఎస్పీగా పదవీ విరమణ చేశారు. హైదరాబాద్ మూసారాంబాగ్ లో సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా పనిచేసిన కాలంలో ప్రజల నోటిలో “సర్కల్ సాబ్”గా సుప్రసిద్ధులయ్యారు.ఆ కాలంలో పోలీస్ అంటేనే భయం. కానీ కిష్టమరాజు దగ్గరకు వస్తే న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉండేది. తన సర్వీస్ మొత్తం అవినీతికి ఏమాత్రం తావివ్వకుండా, నిజాయితీకి కట్టుబడి పనిచేశారు. లాఠీ కంటే మాటకే విలువ ఇచ్చే అధికారిగా,పెద్దలను గౌరవిస్తూ, చిన్నలను ఆదరిస్తూ అందరి మన్ననలు పొందారు. వీరు సర్వీస్ లో ఎన్నో క్లిష్టమైన కేసులకు పరిష్కారం చూపారు.వీరి పేరు పోలీసు శాఖలో రాష్ట్రపతి మెడల్ కు రికమెండ్ చేసారు.పదవి విరమణ తర్వాత న్యాయవాది గా హైకోర్టులో ప్రాక్టీస్ చేసారు. వీరు ఆచార్య బిరుదరాజు రామరాజు సమకాలికుడు దగ్గరి బంధువు బాల్య స్నేహితులు.

**కుటుంబానికి పెద్ద దిక్కు, సమాజానికి మార్గదర్శి:**

ఉద్యోగరీత్యా హైదరాబాద్ లో స్థిరపడిన తర్వాత కూడా తన మూలాలను మర్చిపోలేదు. తన కుటుంబ సభ్యులనే కాక, స్నేహితుల పిల్లలను సైతం చేరదీసి, వారికి ఆశ్రయం ఇచ్చి, చదువులు చెప్పించి, వారి జీవితాల్లో వెలుగు నింపారు. ఆయన ఇల్లు ఒక కుటుంబానికి ఆలయం, ఎందరికో ఆశ్రయం.సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. తన స్వగ్రామం కోడూరు అభివృద్ధి కోసం, విద్య కోసం తన వంతు సహాయం అందిస్తూ ఉండేవారు.శత జయంతి నివాళి: 1926 లో ప్రారంభమైన ఆ జీవన ప్రయాణం, ఒక వ్యక్తి జీవితం ఎలా ఉండాలో, ఒక అధికారి ఎలా నడుచుకోవాలో, ఒక పెద్ద ఎలా ఆదుకోవాలో నేటి తరానికి సజీవ పాఠం. కిష్టమరాజు భౌతికంగా మన మధ్య లేకపోయినా, వారు నాటిన నిజాయితీ, ఆత్మీయత, సేవా భావం అనే విత్తనాలు నేడు మన కుటుంబంలో వృక్షాలై ఉన్నాయి. ఈ శత జయంతి సందర్భంగా ఆ మహనీయునికి మనసారా నివాళులర్పిస్తూ, వారి ఆశయాలను కొనసాగించడమే మనం వారికి ఇచ్చే నిజమైన గౌరవం.కుటుంబ నేపథ్యం: వీరికి ముగ్గురు కుమార్తెలు ముగ్గురు కుమారులు పెద్దకుమార్తె విజయలక్ష్మి భర్త డా.దేవరాజు మదన్ మోహన్ రాజు వీరి కుటుంబం లండన్ లో స్థిరపడ్డారు వీరు ప్రముఖ వైద్యులు.రెండవ కుమార్తె వసుంధర భర్త బిరుదరాజు అశోక్ రాజు వీరు ఆర్ టీ సి డిపో మేనేజర్ గా రిటైర్ అయ్యారు. మూడవ కుమార్తె అరుంధతి భర్త డా.చెన్నమాధవుని దామోదర్ రాజు వ్యవసాయ శాఖలో ప్రముఖ సైంటిస్ట్ గా వున్నారు. పెద్ద కుమారుడు పద్మనాభ రాజు పోలీస్ డిపార్ట్మెంట్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా వుండి ఇటీవల దివంగతులయ్యారు. రెండవ కుమారుడు శ్యాం సుందర్ రాజు సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా అమెరికాలో స్థిర పడ్డారు.మూడవ కుమారుడు గుణవర్ధన్ రాజు సాఫ్ట్వేర్ కంపెనీలో వైస్ ప్రెసిడెంట్ గా వున్నారు.జోహార్ ప్రతికంఠం కిష్టమరాజుకి! అంటున్న ఆత్మకూరు(ఎం) మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు.



## పిరికితనంతో పరారైన కాంగ్రెస్ ప్రభుత్వం..

### శాసన మండలి చరిత్రలో ఇవాళ భయంకరమైన దుర్దినం..!



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు08

చట్ట సభల్లో గత రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చీకటి అధ్యాయమని మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూధనా చారి అభివర్ణించారు. మంగళవారం రాత్రి ఆయన శాసన మండలి మీడియా పాయింట్‌లో సహచర ఎమ్మెల్సీలతో మాట్లాడుతూ.. సభ్యులపై పోలీసులను ఉసిగొల్పి దుర్మార్గంగా వ్యవహరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పిరికితనంతో పరారైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దారుణమైన స్థితిలో ఉందన్న మధుసూధనా చారి.. దేశ సరిహద్దుల్లో బలగాలను మోహరించినట్లుగా వందలాది మంది పోలీసులను పెట్టించి సభ్యులపై దాడికి పాల్పడిందని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల తొలిరోజే కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను బీఆర్ఎస్ పక్షాన మేం ప్రశ్నిస్తే జవాబు లేదు, కాబట్టే ప్రధాన ప్రతిపక్షం లేకుండానే సభ నడిపించే ఎత్తుగడను ఈరోజు కూడా కొనసాగించారని మధుసూధనా చారి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసుల అనుచిత ప్రవర్తనను ఆయన తప్పుపట్టారు. సహచర ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డిలపై కేసులు నమోదు చేయడం.. వారి సభ నుంచి బహిష్కరించేందుకు ఏకపక్షంగా తీర్మానం చేయడంపై మేం చర్చకు పట్టుబట్టగా రేవంత్ సర్కార్ సమాధానం చెప్పలేకపోయిందని ఆయన వెల్లడించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల దాకా వెయిటింగులో పెట్టి, ఎలాంటి చర్చ లేకుండా 3 నిమిషాల్లోనే సభను వాయిదా వేసి కాంగ్రెస్ ప్రభుత్వం పరారైందని మధుసూదనా చారి దుయ్యబట్టారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనానికి పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు.శాసన మండలి చరిత్రలో ఇవాళ భయంకరమైన దుర్దినం అని మధుసూధనా చారి అభివర్ణించారు. మండలిలో ఇరవై మందికి పైగా సభ్యులున్న బీఆర్ఎస్ పక్షాన్ని ..ఏడెనిమిది మంది సభ్యులున్న కాంగ్రెస్ పక్షం తట్టుకోలేకపోతోందని ఆయన తెలిపారు. అందుకే తీర్మానాన్ని నెగ్గించుకునే అవకాశం లేక, ఆగమేఘాల మీద చదివి, మూడంటే మూడు నిమిషాల్లోనే పాస్ చేయించుకొని ఈ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించి పరారైందని మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూధనాచారి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మీడియా పాయింట్‌లో మధుసూధనా చారితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ, తాతా మధు, నవీన్ రెడ్డి, యాదవరెడ్డి, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.